

అను నేను..

అనంతపురం పార్లమెంట్ సభ్యుడిగా అంబికా లక్ష్మీనారాయణ సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.

- అనంతపురం అర్బన్



భయేరియా..!

జిల్లా వ్యాప్తంగా అతిసార.. జ్వర పీడితులు

మారిన వాతావరణం.. విజృంభిస్తున్న వ్యాధులు

కట్టడికి చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం



డయేరియా బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అప్రమత్తమైన యంత్రాంగం

రాష్ట్రంలో అతిసారం, జ్వరాల కేసులు పెరుగుతుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎస్, మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించి, జిల్లా అధికార యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. పలు గ్రామాలలో స్వయంగా పర్యటించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేవారిలో అతిసారం, జ్వరంతో బాధపడేవారు ఎక్కువగా ఉంటున్నారు. జిల్లా ఆస్పత్రిలో 40కి పైగా డయేరియా కేసులు అడ్మిషన్‌లో ఉన్నాయి. ఇందులో చిన్నారులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జ్వర పీడితులో 80 మంది వరకూ అడ్మిట్ అయ్యారు.



ఎఫ్ఎమ్ వార్డులో చికిత్సపొందుతున్న బాధితులు

సీజనల్ వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. వర్షాలు కురవడం, గాలికాలం కావడంతో వాతావరణంలో మార్పులు సంభవించాయి. వ్యాధులు విరుచుకుపడుతున్నాయి. రెండు మూడు వారాల నుంచి జిల్లాలో విష జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. చికిత్స కోసం ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని వైద్యవర్గాలు అంటున్నాయి. సాధారణ లక్షణాలు ఉన్న జ్వర పీడితులు ఓపీలో వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళుతున్నారు. కానీ చిన్నారులు, వృద్ధుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. వాంతులు, విరేచనాలు, తలనొప్పితో బాధపడుతూ.. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతోపాటు పెద్దాసుపత్రిలో అడ్మిట్ అవుతున్నారు. కొందరిని రెఫర్ చేస్తుండటంతో జిల్లా ఆసుపత్రికి వస్తున్నారు.

అనంతపురం టౌన్



● ఈ ఫొటోలో ఉన్న బాలిక పేరు ముస్కాన్. అనంతపురం నగరంలోని నాయక్ నగర్‌కు చెందిన ఈ బాలికకు ఉన్న ఫలంగా వాంతులు, తలనొప్పి మొదలయ్యాయి. మాత్రలు వేసినా నయం కాలేదు. పరిస్థితి ఇబ్బందిగా మారడంతో జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేయాల్సి వచ్చింది.



పెద్దవడుగూరు మండలం మల్లెంపల్లికి చెందిన ఈ బాలుడి వయసు ఏడాది. రెండు రోజులపాటు తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా డాక్టర్‌కు చూపించినా తగ్గలేదు. పైగా వాంతులు మొదలయ్యాయి. బాలుడి పరిస్థితి విషమంగా మారడంతో జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్న పిల్లల వార్డులో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేశారు.

బయటి ఆహారం వద్దు



ఈ కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలడం మామూలే. వ్యాధులబారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారం, నీరు కలుషితం కావడంవల్లే జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి. ఈ సీజన్‌లో పిల్లలకు బయటి ఆహారం తినిపించకూడదు. బయటి నీరు తాగించకూడదు. పెద్దలు కూడా వీటికి దూరంగా ఉండాలి. జ్వరం, వాంతులు, విరేచనాలు ఉండి.. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రెండు మూడు రోజుల్లో వ్యాధి తగ్గిపోతుంది. కానీ బలహీనంగా ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల వద్దకు తీసుకెళ్లాలి.

- డాక్టర్ శంకరనారాయణ, చిన్నపిల్లల వైద్యనిపుణులు

డీఎంహెచ్‌ఓకు పంపుతున్నాం..



సీజనల్ వ్యాధుల కేసుల వివరాలను రోజువారీగా డీఎంహెచ్‌ఓకు తెలియజేస్తున్నాం. జిల్లా ఆస్పత్రికి కొద్దిరోజులుగా సీజినల్ కేసులు అధికంగానే వస్తున్నాయి. ఎక్కువ మంది ఓపీ కేంద్రాలలో డాక్టర్లతో చికిత్స చేయించుకుని వెళుతున్నారు. డయేరియా కేసుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి డయేరియా బాధితులు ఇక్కడికి వస్తున్నారు. బాధితులు అడ్మిషన్ పొంది చికిత్స తీసుకుంటున్నారు. అందరి పరిస్థితి మెరుగ్గా ఉంది. అవసరమైన మందులు ఉన్నాయి.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

నియంత్రిస్తాం..



జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. కలెక్టర్ సమావేశాలు ఏర్పాటు చేసి పలు రకాల ఆదేశాలు ఇచ్చారు. అన్నిశాఖలతో కలిసి ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభావిత గ్రామాలలో వైద్య సిబ్బంది తగిన చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ వ్యాధుల ప్రభావం తక్కువగానే ఉంది. అయినా అప్రమత్తంగా ఉంటున్నాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ



మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అప్రమత్తంగా ఉన్నాం: కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 24: జిల్లాలో అతిసార ప్రబలకుండా తగిన చర్యలు చేపడుతున్నామని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియ, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్‌తో కలిసి ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల అతిసార కేసులు పెరుగుతున్నాయని, అరికట్టేందుకు అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు. రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకుల వద్ద చెత్తాచెదారం వేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. చేతులు శుభ్రం చేసుకుంటే అతిసార దరిచేరదని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. అతిసార కేసులు వస్తే వెంటనే చికిత్స అందించడానికి సిద్ధంగా ఉండాలని వైద్య శాఖను ఆదేశించారు. విద్యాసంస్థలు, వసతి గృహాలలో పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలని సూచించారు.

అమిగోస్ అక్రమాలపై

సీఐడీ దర్యాప్తు చేయించండి

కలెక్టర్‌కు కాంట్రాక్టర్ చంద్రశేఖరరెడ్డి ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న చంద్రశేఖరరెడ్డి

అనంతపురం టౌన్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలో మైనింగ్ లీజ్ పేరిట రూ.వెయ్యి కోట్ల దోపిడీకి పాల్పడిన అమిగోస్ సంస్థ అక్రమాలపై సీఐడీ దర్యాప్తు జరిపించాలని క్వారీ యజమాని చంద్రశేఖరరెడ్డి కలెక్టరుకు విన్నవించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఆయన అమిగోస్ అక్రమాలను వివరించారు. రాప్తాడు మండలంలో తనకు గ్రావెల్ క్వారీ ఉందని, బెదిరించి లాక్కోవాలని చూశారని అన్నారు. తన వాహనాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని, తన రాయల్టీ పేపర్‌ను చించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చెల్లించిన సొమ్ముకు బిల్లు ఇవ్వకుండా మంత్రి పేరిట బెదిరించారని, లైసెన్స్‌డ్ గన్‌తో కాల్చిపారేస్తామని బెదిరించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లీజుదారులకు ఫేక్ రాయల్టీ బిల్లులు ఇచ్చి రూ.కోట్లు దండుకున్నారని అన్నారు. వారి అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమిగోస్ సంస్థకు సీనరేజ్ కలెక్షన్ కాంట్రాక్టును 24 నెలలకు రూ.259 కోట్లకు ఇచ్చిందని, నెలకు రూ.10.79 కోట్లు చెల్లించాలని ఆదేశించిందని తెలిపారు. కానీ ఆ సంస్థ ఏకంగా రూ.వెయ్యి కోట్లు వసూలు చేసిందని ఫిర్యాదు చేశారు. ఆ సొమ్మును తమ వాహనాల్లో తరలించి వైసీపీకి అందించారని ఆరోపించారు.

గుట్టుగా గ్రీవెన్స్..!

మీడియాకు నో ఎంట్రీ... విస్తుగొలిపేలా పోలీసుల తీరు



గ్రీవెన్స్ నుంచి ప్రజలు బయటకు వచ్చే దారి, విలేకరులు వెళ్లే దారికి అడ్డుగా వేసిన గేట్

అనంతపురం క్రైం, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు మీడియా ప్రతినిధులను వెళ్లనివ్వలేదు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ వద్దకు విలేకరులను వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్పీ గౌతమి శాలి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కానీ ఆ హాల్‌లోకి విలేకరులను అనుమతించలేదు. కాసేపటి తరువాత ఎస్పీ సీఐ ఇందిర బయటకు వచ్చారు. 'మీకు టైగర్ లాంటి పీఆర్వోను ఇచ్చాం. గ్రీవెన్స్ హాల్‌లోకి మిమ్మల్ని అనుమతించం. ఏమైనా ఉంటే పీఆర్వోను అడిగి తీసుకోండి' అని చెప్పి వెళ్లారు. గతంలో పోలీస్ గ్రీవెన్స్‌లో మీడియాకు కుర్చీలు వేసేవారు కాదు. కానీ అనుమతించేవారు. ఇప్పుడు ఏకంగా అనుమతి లేదని బయటే నిలబెట్టేశారు. పైగా గ్రీవెన్స్ హాల్‌లోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ డిటెక్టర్‌తో చెక్ చేశారు. సెల్‌ఫోన్‌లను, ఇతర వస్తువులను బయటే పెట్టి వెళ్లాలని సూచించారు. ఫిర్యాదులు స్వీకరించేందుకే ఇన్ని ఆంక్షలు పెడితే.. ఇక సమస్యలు ఎలా పరిష్కారమౌతాయని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వం 'స్పందన' పేరు మార్చినా ప్రజలకు తెలిసేలా ఒక ఫ్లెక్సీని కూడా ఏర్పాటు చేయలేదు. ప్రతి సోమవారం ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమం పునఃప్రారంభిస్తున్నామని కూడా చెప్పలేదు. దీంతో ప్రతి వారం సుమారు 140 వరకు అందే ఫిర్యాదులు 79కి పడిపోయాయి.

వదిన.. మరిది ఆత్మహత్య

చాగల్లు రిజర్వాయర్‌లో మృతదేహాలు



రిజర్వాయర్ నీటిలో తేలియాడుతున్న మహిళ మృతదేహం

తాడిపత్రి టౌన్, జూన్ 24

వివాహేతర సంబంధం కారణంగా వరుసకు వదిన, మరిది అయ్యే ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌లో వారి మృతదేహాలు సోమవారం బయటపడ్డాయి. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఓ యువకుడు(26) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వరుసకు వదిన(35) అయ్యే మహిళ గుత్తి మండలంలోని ఓ గ్రామంలో ఉంటోంది. ఆమె భర్త ఆటో డ్రైవర్. దగ్గరి బంధువులు కావడంతో ఒకరి ఇంటికి మరొకరు తరచూ వచ్చివెళ్లేవారు. ఈ క్రమంలో వదిన, మరిది దగ్గరయ్యారు. ఈ విషయం రెండు కుటుంబాలవారికి తెలియడంతో మందలించారు. దీంతో కొన్నాళ్లు దూరంగా ఉన్నారు. నాలుగు రోజుల క్రితం ఆమె తాడిపత్రికి వచ్చింది. మరిదితో కలిసి ఎటో వెళ్లిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందోగాని.. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆపి ఇద్దరూ రిజర్వాయర్‌లోకి దూకారు. రిజర్వాయర్ వద్ద ఎవరో బైక్‌ను వదిలి వెళ్లారని పెద్దపప్పూరు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులకు.. ఇద్దరు కనిపించడం లేదని తెలిసి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రిజర్వాయర్‌లో సోమవారం మధ్యాహ్నం మహిళ మృతదేహం, సాయంత్రం ఆమె మరిది మృతదేహం తేలాయి. ఫొటోల ఆధారంగా పెద్ద పప్పూరు పోలీసులు మృతదేహాలను గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఆ మహిళకు కుమారుడు, కూతురు ఉన్నారు. యువకుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హౌసింగ్‌లో అనకొండ

- సిమెంటు, స్టీలు, ఇసుక పక్కదారి
- బంధువులు, ఉద్యోగులకు ఇంటి పట్టాలు
- రాక్రీట్ కార్మికుల చేత ఇళ్ల నిర్మాణ పనులు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే అండతో భారీ దోపిడీ

అనంతపురం సిటీ, జూన్ 24:

జిల్లా గృహ నిర్మాణశాఖలో ఓ ఇంజనీరింగ్ అధికారి ఐదేళ్ల వైసీపీ పాలనలో భారీగా అవినీతికి పాల్పడ్డారు. డీఈఈ స్థాయి అధికారి అయిన ఆయన ఆ విభాగపు ఉన్నతాధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే అండతో పీడీ స్థాయి అధికారిని కూడా శాసించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి వినియోగించాల్సిన సిమెంటు, ఇసుక, స్టీలు తదితర సామగ్రిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. బిల్లుల మంజూరులోనూ ఇదే తీరు కొనసాగింది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆయన అప్పటి ఎమ్మెల్యేని ప్రసన్నం చేసుకున్నారు. అనంతపురం ఈఈగా అదనపు బాధ్యతలు తెచ్చుకున్నారు. కింది స్థాయి ఉద్యోగుల్లో కొందరికి ఇంటి పట్టాలు ఇప్పించారు. ఇళ్లను కట్టించి ఇస్తామని ఆశపెట్టాడు. అలా ఉద్యోగులను తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. ఎక్కడికక్కడ కాసులు ఎర వేసి మరీ అవినీతికి పాల్పడ్డారు. కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న ఓ అధికారిని అనంతపురానికి బదిలీ చేస్తే.. అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే అండతో అడ్డుకున్నాడు. ఇన్‌చార్జిగా తానే ఉండేలా చూసుకున్నాడు.

పెద్ద మాయావి..

గృహ నిర్మాణశాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయనకు శాఖాపరంగా జరిగే పనుల గురించి పూర్తిస్థాయి అవగాహన ఉంది. ఎవరు అధికారంలో ఉంటే వారిని లైన్‌లో పెట్టుకుంటారు. మాయమాటలతో ప్రజాప్రతినిధులను బుట్టలో వేసుకుని, తన అక్రమాలు కొనసాగిస్తారు. ఇసుక, సిమెంట్, స్టీలు తదితర సామగ్రి విషయంలో సదరు డీఈఈ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆ శాఖలో చర్చ సాగుతోంది. లెక్కలు సక్రమంగా లేకపోయినా.. రికార్డులు పక్కాగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారట.

భారీగా అక్రమాలు

● ఐదేళ్లలో అక్రమాల్లో కొన్ని ఆయన సొంతానికి.. మరికొన్ని రాక్రీట్ కోసం చేసినవి ఉన్నాయని సమాచారం. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన ఆయన సమీప బంధువు బెంగళూరులో ఉంటున్నారు. ఇంకా వివాహం కూడా కాలేదు. అనంతపురం నగరంలోని 30వ వార్డులో మ్యాపింగ్ చేయించి, ప్రసన్నాయపల్లి లే అవుట్‌లో అతని పేరిట ఇంటి పట్టా మంజూరు చేయించి, ఇంటి నిర్మాణం చేయిస్తున్నాడు.

● ఇదే లే అవుట్‌లో తన భార్య సోదరి పేరిట కూడా ఇంటి పట్టా ఇప్పించి, ఇంటి నిర్మాణం చేయిస్తున్నాడు. రాక్రీట్ కార్మికులే ఈ పనులు చేస్తున్నారని సమాచారం. వీరితోపాటు తన కింద పనిచేస్తున్న ఓ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్‌కు రెండేసి ఇంటి పట్టాలు ఇప్పించారట. అలా తన అవినీతి, అక్రమాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం.

● రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కాటిగానికాలువ, కట్టకిందపల్లి, కక్కలపల్లి తదితర ప్రాంతాల్లో గతంలో కట్టిన సుమారు 120 ఇళ్లకు మరోమారు బిల్లులు చేయించి సొమ్ము చేసుకున్నారని తెలిసింది. ఇందులో ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర ఎక్కువగా ఉందని తెలిసింది. స్టేడియాల నిర్మాణంలో కూడా ఆయన అవినీతికి పాల్పడ్డారని సమాచారం.



సమీప బంధువుకు చెందిన ఇల్లు

రూ. కోట్లకు పడగ..

దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. జీతాలు బాగానే వస్తాయి. కానీ.. మరీ రూ.కోట్లలో రావు కదా..! ఆ ఇంజనీరింగ్ అధికారి ఆస్తులు మాత్రం రూ.కోట్లలో ఉన్నాయని సమాచారం. మాటలే పెట్టుబడిగా ప్రజా ప్రతినిధులను బుట్టలో వేసుకోవడం.. దోచుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అంటారు. ఆయనకు నాలుగు కార్లు, గుత్తి సమీపంలోని ఓ గ్రామంలో పెద్ద ఎత్తున ఆస్తులు, నగర శివారులో మూడు ఇళ్లు ఉన్నాయి. ఇవికాగ అనేక ప్రాంతాల్లో గుట్టుగా ఆస్తులను పోగేశారని సమాచారం. ఆయన కుమారుడు విదేశాల్లో చదువుతున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పేరిట సబ్సిడీ రుణాలతో ఆయన కార్లను కొనుగోలు చేశారని సమాచారం. రాప్తాడు మాజీ ఎమ్మెల్యేకు చెందిన రాక్రీట్ సంస్థకు ఆయన అక్రమంగా రూ.కోట్లలో బిల్లులు దోచి పెట్టారని సమాచారం.



ఆ అధికారి భార్య సోదరి పేరిట కట్టిస్తున్న ఇల్లు ఇదే..

ప్రజల సొమ్ముతో ప్యాలెస్ నిర్మాణమా..?

వైసీపీ తీరుపై తెలుగు మహిళల ఆగ్రహం

జగన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన



జగన్ చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, జూన్ 24: ప్రజల సొమ్ముతో విలాసవంతమైన ప్యాలెస్‌లాగా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తారా అని తెలుగు మహిళలు మండిపడ్డారు. అనంతపురం నగరంలోని హెచ్చెల్సీ కాలనీ సమీపంలో ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం ఎదుట వారు సోమవారం ఆందోళనకు దిగారు. మాజీ సీఎం జగన్ చిత్రపటానికి చెప్పులదండ వేసి ఊరేగించారు. జగన్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని మాట్లాడుతూ... అనంతపురంలో జల వనరుల శాఖకు చెందిన 1.50 ఎకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం తీసుకున్నారని అన్నారు. ఏడాదికి ఎకరానికి కేవలం రూ.వెయ్యి చెల్లించేలా 33 ఏళ్ల పాటు భూమిని లీజుకు తీసుకున్నారని మండిపడ్డారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసి ప్యాలెస్‌లు కట్టుకోవడం దుర్మార్గమని అన్నారు. నిబంధనలను అతిక్రమించిన మాజీ సీఎం జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న వైసీపీ కార్యాయాలను ప్రభుత్వం స్వాధీనం చేసకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ ధరకు లీజుకు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు మనెమ్మ, అయేషా, శ్రీదేవి, జ్యోతి, శశికళ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్‌బాబు


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయశంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, జూన్ 24: మండల పరిధిలోని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి రాజమండ్రిలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా బదలీ అయ్యారు. విజయశంకర్ బాబు మాట్లాడుతూ జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా శాస్త్రవేత్తల బృందంతో సమష్టిగా పరిశోధనలు ప్రధానంగా వేరుశనగ, అంతర పంటలపై దృషిసారించి, రైతులకు మరిన్ని సేవలందిస్తామన్నారు.

పలువురు శాస్త్రవేత్తలు బదలీ: ఈయనతో పాటు శాస్త్రవేత్తగా పనిచేస్తున్న పీ రాధిక ఏలూరు జిల్లా మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా బదలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తగా రమేష్‌నాయక్ ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడే పనిచేస్తున్న మరో శాస్త్రవేత్త పవన్‌కుమార్ రెడ్డిని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి బదిలీ అయ్యారు.

లక్ష మొక్కలను పెంచుదాం: కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 24: జిల్లాలో ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పచ్చదనం ఎక్కువగా ఉంటే వర్షాలు బాగా కురుస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. జూలై నెలలోపు లక్ష మొక్కలు నాటేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు. ఇందుకోసం ఒక మొబైల్ యాప్ తయారు చేశామని, నాటిన మొక్కల సంరక్షణను దత్తత ఇస్తామని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత దత్తత ఇచ్చి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించి, ప్రమాణపత్రం వారికి అందజేస్తామని అన్నారు. సోషల్ ఫారెస్టులో 10,08,771 మొక్కలు, రాయదుర్గం ఫారెస్టులో 50 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కలు నాటడం, పెంచడం కోసం వివిధ శాఖలకు టార్గెట్ ఇచ్చామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు చెట్లునాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడినవారు

కణేకల్లు, జూన్ 24: మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం బస్టాండ్ వద్ద ఎర్రిస్వామి అనే వ్యక్తిపై కుక్క దాడి చేసింది. అలాగే దిగువగేరిలోని కొండారెడ్డి స్కూల్‌లో చదివే హేమంత్, యాస్మిన్ అనే విద్యార్థులపై కూడా దాడి చేసి గాయపరిచింది. వీరందరికీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం పిచ్చికుక్కను స్థానికులు చంపేశారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ టౌన్, జూన్ 24: ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో బాలికల ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాసంస్థల డీన్ రాము సోమవారం ఒక ప్రకటన విడుదల చేసినట్టు పీఆర్‌ఓ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ గండిపేటలో ఉన్న హైదరాబాద్ డిగ్రీ అకాడమీలో డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు 30వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా రాయలసీమ ప్రాంత విద్యార్థులకు అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ రిలయన్స్ టవర్‌లో ఉన్న అనంత భవిత ఐఏఎస్ అకాడమీలో రాత పరీక్ష ఉంటుందన్నారు. నిర్దేశించిన మార్కులు వచ్చిన పది మంది విద్యార్థులకు నెలక రూ.5వేలు, మరో 15 మందికి రూ.3వేలు చొప్పున మూడేళ్లు ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 7660002627, 9908551643 నంబర్లకు సంప్రదించాలన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

యల్లనూరు, జూన్ 24: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో టీడీపీ కార్యకర్త గంగాధర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శంకర్‌తోపాటు మరికొంతమంది దాడిచేశారు. రెండురోజుల నుంచి వైసీపీకి చెందిన కొంత మంది సోషల్ మీడియాలో టీడీపీ వారిపై రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంపై యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో టీడీపీ కార్యకర్త గంగాధర్‌పై శంకర్‌తోపాటు మరికొంతమంది దాడికి ప్రయత్నించారు. ఈ దాడిలో గంగాధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స కోసం తిమ్మంపల్లికి వెళ్లగా అక్కడ కూడా మరోసారి దాడికి ప్రయత్నించాడని గంగాధర్ తెలిపారు. యల్లనూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దాడికి యత్నించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురం రూరల్, జూన్ 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,010 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆరోగ్య మత్తు..!

- జగన్ పాలనలో నాసిరకం మద్యం విక్రయాలు
- ధర పెంచి మందుబాబుల జేబులకు చిల్లులు
- నాసిరకం మద్యంతో ఒళ్లు గుల్ల
- నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూపులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో కొత్త ఉత్సాహం





"అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కీలక అంశాల్లో ఒకటి.. నాసిరకం మద్యం. మునుపెన్నడూ లేని బ్రాండ్లను ప్రవేశపెట్టి.. భారీగా మద్యం ధరలను పెంచిన వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జె-బ్రాండ్ మద్యం కారణంగా తమ ఆరోగ్యం దెబ్బ తింటోందని మద్యం ప్రియులు వాపోయారు. పెరిగిన మద్యం ధరల కారణంగా మద్యం సేవించి అలవాటు ఉన్న పేదలు ఆర్థికంగా నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వ తీరును విమర్శిస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు మద్యం విషయంలో సంస్కరణలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ధరలను తగ్గించడం, మునుపటి బ్రాండ్లను అందుబాటులోకి తేవడం, నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయడం వంటి హామీలు ఇప్పుడు అమలులోకి రావాల్సి ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మద్యం ప్రియులు పండుగ చేసుకున్నారు. మద్యం మితంగా తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ వ్యసనంగా మారితే ఆరోగ్యం చెడిపోతుంది. ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటారు. మద్యం సేవించే అలవాటు ఉన్నవారు జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది."

అనంతపురం అర్బన్, జూన్ 24: నాణ్యమైన మద్యం కోసం మందు బాబులు ఎదురు చూస్తున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యాన్ని తమపై రుద్దాడని, గతిలేక దాన్నే తాగి ఒళ్లు గుల్ల చేసుకున్నామని పలువురు మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బూంబూం, బ్లాక్ బస్టర్, ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్, హార్సెస్, ఓషన్ బ్లూ, గోల్డెన్ కింగ్, దారుహౌస్, ఆంధ్రాగోల్డ్, సుప్రీం ఇలా పలు రకాల పేర్లతో నాసిరకం మద్యాన్ని తమకు అంటగట్టారని వారు మండిపడుతున్నారు. ఈ నాసిరకం మద్యాన్ని కూడా రెండింతల ధరకు విక్రయించి జేబుకు చిల్లుపెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే గతంలోని కొన్ని బ్రాండ్స్‌ను పక్కన పెట్టి, జే బ్రాండ్స్‌ను మార్కెట్‌లో తెచ్చారు. ఇందులో ఎక్కువ మోతాదులో స్పిరిట్ ఉండటంతో దాన్ని తాగిన ఎక్కువ శాతం మంది అనారోగ్యం పాలయ్యారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వినియోగించే చీప్ లిక్కర్‌తో పాటు రెగ్యులర్, మీడియం బ్రాండ్లను కల్తీచేయడంతో అనారోగ్యం పాలయ్యామని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం పరిపాలన ప్రారంభం అయ్యింది. గతంలో హామీ ఇచ్చిన మేరకు ప్రస్తుత పాలకులు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తారని మందుబాబులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో షాపుల నిర్వహణ

వైసీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 186 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. ప్రతి ఏడాది రూ.110 కోట్లకుపైగా విలువైన మద్యం, బీర్ల విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం తయారీ కంపెనీలను వైసీపీ నేతలు ఆక్రమించుకొని నాసిరకం మద్యాన్ని తయారు చేసి ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరిపారు. కేవలం నగదు తీసుకొని మద్యాన్ని విక్రయించారు. దీనిపై అప్పటి ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. దీంతో రెండేళ్ల తర్వాత మద్యం షాపులకు డిజిటల్ యంత్రాలు సరఫరా చేశారు. కానీ పాత పద్ధతిలోనే డబ్బులు చెల్లిస్తేనే మద్యాన్ని విక్రయించారు. తద్వారా భారీగా దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.


అనంతపురంలోని ప్రభుత్వ మద్యం దుకాణం

మారనున్న మద్యం పాలసీ

గత టీడీపీ హయాంలో మద్యం పాలసీ నిబంధనల మేరకు అమలు చేసేవారు. లైసెన్స్ విధానంలో టెండర్లు, లాటరీ విధానం ద్వారా ప్రైవేటు షాపులకు అనుమతులు ఇచ్చారు. అప్పట్లో మద్యం ఎంఆర్‌పీపై వ్యాపారులకు 15 శాతం దాకా ప్రభుత్వమే చెల్లించేది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ విధానాన్ని రద్దు చేసి, మద్యాన్ని ఎంతకైనా విక్రయించుకోవచ్చని చీకటి జీవోను జారీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నిర్వహించి మద్యం మాఫియాకు తెరలేపారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో పాత మద్యం పాలసీని తిరిగి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. లాటరీ లేదా టెండర్ల ద్వారా మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించనున్నట్లు సమాచారం. ఆ నోటిఫికేషన్ కోసమే మందు బాబులందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం డిపోలో స్టాక్ ఉన్న జే బ్రాండ్లు మాత్రమే మద్యం షాపులకు పంపుతున్నారు. కంపెనీల నుంచి సరఫరాను ఆపేసినట్లు తెలిసింది. టెండర్లు లేదా లాటరీ విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు షాపులు కేటాయించినప్పటి నుంచి నాణ్యమైన మద్యం సరఫరా కానుంది. అంతర్జాతీయ కంపెనీలు తయారు చేసే మద్యం బ్రాండ్లు మళ్లీ దర్శనమివ్వనున్నాయి. జే బ్రాండ్స్ పూర్తిగా బంద్ కావడంతోపాటు గత టీడీపీ హయాంలో సరఫరా చేసిన విధంగానే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తారని సమాచారం. ఆ క్షణం కోసమే మద్యం ప్రియులు ఎదురుచూస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



వైసీపీ హయాంలో నాసిరకం మద్యాన్ని అంటగట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారు. గతంలో పోలిస్తే రెండింతలు అధిక ధరలు పెంచేసి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడేలా చేశారు. నాసిరకం మద్యం తాగలేక మద్యం ప్రియులు నానా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఎప్పుడెప్పుడు పోతుందా.. నాసిరకం మద్యం బెడద ఎప్పటి నుంచి తప్పుతుందా అని అందరూ ఎదురుచూశారు. అనుకున్నట్టుగానే టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ నాణ్యమైన మద్యం సరఫరా చేయడం ఖాయమని అందరూ ఆశతో ఎదురుచూస్తున్నారు.

\- వెంకటసతీష్, అనంతపురం

జగన్‌ను తిట్టనివాడే లేడు



మద్యం షాపుల వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు చేసిన వారిలో జగన్‌ను తిట్టని వారే లేరు. ధరలు పెంచడంతోపాటు నాసిరకం మద్యం అంటగట్టడంతో జగన్ ఎప్పుడు దిగిపోతాడా అని మద్యం ప్రియులందరూ ఎదురుచూశారు. నాసిరకం మద్యం తాగిన వారు ఎవరూ వైసీపీకి ఓటు వేయలేదు. కూలి పనులు చేసుకొని ఒళ్లునొప్పులు తగ్గేందుకు నాలుగు పెగ్గులు తాగే మద్యం ప్రియులు ఆ రోజు వచ్చిన కూలి డబ్బులన్నీ మద్యానికి ఖర్చు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మద్యానికి అలవాటుపడిన అనేక మంది ధరలు పెంచడంతో అప్పులపాలయ్యారు. టీడీపీ అధికారంలో రావడంతో తమకు నాసిరకం జే బ్రాండ్స్ బెడద నుంచి విముక్తి కలగతుందని అందరూ సంతోషపడుతున్నారు.

\- చంద్రమోహన్, అనంతపురం

తెగిన చెక్‌డ్యాంలు..!

- వృథాగా పోతున్న వర్షపు నీరు
- రూ.లక్షల నిధులు నీటిపాలు


పి. సిద్దరాంపురం సమీపాన తెగిపోయిన చెక్‌డ్యాం

ఆత్మకూరు జూన్ 24: మండలంలో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెక్‌డ్యాంలు వర్షాలకు తెగిపోతున్నాయి. ప్రభుత్వం గ్రామాల్లో వాటర్‌షెడ్‌ల ద్వారా చెక్‌డ్యాంలు నిర్మిస్తే వాటిని కొందరు రైతులు నీటినిల్వతో పంటలు దెబ్బతింటున్నాయని ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలలో చేరిన నీరు నిల్వ ఉండటం లేదు. చెక్‌డ్యాంల ద్వారా నిల్వ ఉన్న నీటితో భూగర్భజలాలు పెంపొందుతాయి. గత టీడీపీ పాలనలోనే అత్యధికంగా చెక్‌డ్యాంలు నిర్మించారు. దీంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పి సిద్దరాంపురం గ్రామ సమీపాన రూ.5 లక్షలుతో నిర్మించిన చెక్‌డ్యాం తెగిపోయింది. దీంతో వర్షం నీరు వృథాగా పోతోంది. మండలంలో మరిన్ని చెక్‌డ్యాంల పరిస్థితి ఇదే. వాటిని పట్టించు కొనేవారు కరువయ్యారు. మండల అధికారులు ఆత్మకూరు వద్దనున్న చెక్‌డ్యాంనకు తాత్కాలికంగా రూ.10 లక్షలతో మరమ్మతు చేయించారు. అయితే కొందరు దానిని ధ్వంసం చేశారు. మూడేళ్లయినా చెక్‌డ్యాం మరమ్మతు చేయలేదు. పి.యాలేరు, మదిగుబ్బ, సనప, ముట్టాల, గొరిదిండ్ల, ఆత్మకూరు, పి.సిద్దరాంపురం గ్రామాల్లో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెక్‌డ్యాంలు తెగిపోయాయి. రైతులు పలుసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకకుండా పోయింది.

ఆత్మకూరు చెరువుకు మోక్షమెప్పుడో?

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చెరువు 15 ఎళ్ల క్రితం కురిసిన వర్షాలకు తెగిపోయింది. అప్పటి నుంచి రైతులు, ప్రజలు వర్షపు నీటితో అష్టకష్టాలు పడుతున్నారు. చినుకు వర్షం పడితే కునుకు లేకుండా పోతోందని చెరువు ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో గత ఎమ్మెల్యే చెరువుకట్టకు మరమ్మతు చేయించి, చెరువులో నీటిని నిల్వ చేస్తానని ఐదేళ్లు మాయమాటలతో కాలం గడిచిపోయిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేసి చెరువును పట్టించుకోకుండా వదిలేశారు. భారీ వర్షాలు కురిస్తే రాత్రివేళల్లో ఎప్పుడు ఇళ్లలోకి నీరు వస్తాయోనని ఎస్సీ కాలనీ వాసులు బిక్కుబిక్కు మంటూ గడపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్షం కారణంగా చెరువుపై దృష్టి సారించలేదని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా టీడీపీ ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకుని తెగిపోయిన చెక్‌డ్యాంలు, చెరువును మరమ్మతు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


ఆత్మకూరులో తెగిపోయిన చెరువు

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, జూన్ 24: ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ సెక్యూరిటీ సంస్థలో అనంతపురంలో పనిచేయుటకు పదో తరగతి నుంచి డిగ్రీ అర్హతతో సూపర్‌వైజర్, గార్డ్ పోస్టులకు 26వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా కియ అనుబంధ సంస్థ సియాన్ ఆటోమేటివ్ సంస్థ పెనుకొండలో పనిచేసేందుకు బీటెక్, డిప్లొమా, ఏదేని డిగ్రీ అర్హతతో గ్రాడ్యుయేట్, డిప్లొమా ఇంజనీర్ ఉద్యోగాలకు 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి నిర్వహించే ఉద్యోగ మేళాకు ఆసక్తిగల యువతీ, యువకులు వారి బయోడేటాతో హాజరు కావాలని కోరారు.

35,800 భూసార పరీక్షల నిర్వహణ

అనంతపురం అర్బన్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 35,800 భూసార పరీక్షలు నిర్వహించినట్లు అనంతపురం భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత సోమవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 18,600, సత్యసాయి జిల్లాలో 17,200 పరీక్షలు నిర్వహించారన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారులు రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

73,993 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 24: జిల్లాలోని ఆర్బీకేల్లో సోమవారం 25వ రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి వరకు 82,125 మంది రైతులకు 73,993 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 84,632 మంది రైతులు 74,725 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

నేటిలోగా గురుకులాల్లో చేరండి

- ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్24: ఉమ్మడి అనంత జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీటు పొందిన విద్యార్థులు మంగళవారంలోగా వారి వారి గురుకులాల్లో చేరాలని... లేదంటే తరువాతి మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు సీటును కేటాయించనున్నట్లు అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. సీటు పొందిన విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్కు మొదటి పేజీ, ఫొటోలు, ర్యాంక్ కార్డు, అలాట్‌మెంట్ కాపీలతో సీట్లు కేటాయించిన గురుకులాల్లో చేరాలన్నారు. లేని పక్షంలో ఈ సీట్లను వేరొక విద్యార్థులకు కేటాయిస్తామన్నారు.

ఉపాధి కూలీలపై చిన్నచూపు..!

- వైసీపీ పాలనలో కనీస సౌకర్యాలు మృగ్యం
- గడ్డపార కూడా ఇవ్వని దుస్థితి
- నామమాత్రంగా మెడికల్ కిట్లు, టార్పాలిన్ల పంపిణీ
- వేసవి అలవెన్స్‌కు మంగళం
- కూలీలపై అదనపు భారం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 24: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి కూలీలకు వసతులు కరువయ్యాయి. కూలీలే గత్యంతరం లేక కాయకష్టం చేసిన డబ్బుతో గడ్డపారలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి, పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధి పథకం నిబంధనల మేరకు కూలీలు చేసిన పనులతోపాటు 40 కూలీల సామగ్రికి ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చిందే తప్ప.. ఉపాధి కూలీల వసతులపై దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమడగూరు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు మండలాల్లో 26,085 జాబ్‌కార్డులుండగా, 48,082 మంది కూలీలు పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 21,991 జాబ్‌కార్డులకు గాను 39,170 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు ఉపాధి అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లుగా గడ్డపారలేవీ?

వైసీపీ పాలనలో ఉపాధి కూలీలకు కనీసం గడ్డపార ఇచ్చిన పాపానపోలేదు. 2014-19 టీడీపీ పాలనలో గడ్డపారలు, మెడికల్ కిట్లు ఇతర వసతులు కల్పించారు. వైసీపీ పాలనలో వాటి ఊసే మరిచారు. కూలీలు సొంతంగా గడ్డపారలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయాల్సి వచ్చింది. మెడికల్ కిట్లు, టార్పాలిన్లు తూతూమంత్రంగా అందించి, మమ అనిపించారు. తరువాత వాటి జాడ కనిపించలేదు. ప్రథమచికిత్స కిట్లు లేకపోవడంతో పని ప్రదేశంలో కూలీలు ప్రమాదాల బారిన పడితే ప్రథమ చికిత్స లేకపోవడంతో పొరు గ్రామాలకెళ్లి ప్రయివేటు వైద్యుల వద్ద ప్రథమ చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వేసవిలో నీడకోసం టార్పాలిన్లు లేకపోవడంతో మండు టెండలోనే ఉపాధి పనులు చేసి, పలువురు వడదెబ్బ బారినపడ్డారు.

అదనపు భారం తగ్గేనా?

ఉపాధి పథకం ప్రారంభం నుంచి కూలీలు గడ్డపారలు పదును పట్టడానికి, తాగునీటి సౌకర్యంతోపాటు పంచాయతీ పరిధిలో ఐదు కిలోమీటర్లు దూరం వెళ్లి పనులు చేసిన కూలీలకు ప్రయాణ చార్జీలు చెల్లించేవారు. 2021 నుంచి ప్రభుత్వం వాటిని చెల్లించకపోవడంతో కూలీలపై అదనపు భారం పడుతోంది. వేసవిలో అదనంగా మార్చిలో కూలీలకు 30 శాతం, ఏప్రిల్‌లో 40 శాతం చెల్లించేవారు. దానిని కూడా రద్దు చేయడంతో కూలీలు నష్టపోయారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

వైసీపీ పాలనలో కూలీలు వసతుల్లేక నానా ఇబ్బందులు పడ్డారు. కష్టపడిన సొమ్ములోనే వసతి సౌకర్యాలు కల్పించుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూలీలకు వసతి సౌకర్యం కల్పిస్తారని, వేసవి కాలంలో చెల్లించే అదనపు కూలి ఇస్తారని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నట్లుకూలీలంటున్నారు. ఉపాధి కూలీల వసతులపై కూటమి ప్రభుత్వం దృష్టించి, ఆదుకోవాలని అవసరంఎంతైనా ఉంది.

ఐదేళ్లుగా వసతులు కరువు



గడిచిన ఐదేళ్లలో కూలీ పనులకు వసతులు లేక నానా ఇబ్బందులు పడ్డం. చేసిన కష్టంతోనే వస్తువులు కొనుగోలు చేశారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించిన వసతులు కల్పించలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కూలీల కష్టాలు గుర్తిస్తారన్న నమ్మకముంది.

\- చిన్నబాబు, వీరఓబునపల్లి

వేసవి భత్యం ఇవ్వాలి:



గతంలో వేసవిలో చెల్లిస్తున్న వేసవి భత్యాన్ని తిరిగి కొనసాగించాలి. కొతర లేకుండా గడ్డపారలు, మెడికల్ కిట్లు, టార్పాలిన్లు అందించాలి. గత ప్రభుత్వం ఉపాధి కూలీలను విస్మరించింది. కూటమి ప్రభుత్వ ఉపాధి కూలీల కష్టాన్ని గుర్తించి, వసతి సౌకర్యాలు కల్పించాలి.

\- రమణ, ఎం. కొత్తపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గడ్డపారల పంపిణీపై అప్పట్లోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఐదేళ్లపాటు గడ్డపారలు రాలేదు. వచ్చిన మెడికల్ కిట్లు, టార్పాలిన్లు పంపిణీ చేశాం. కూలీలకు వసతుల కల్పన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

\- శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, డ్వామా

అడిగేవారెవరని..!

- కొర్రపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరాచకాలు
- సిబ్బందితో వెట్టిచాకిరీ... పిల్లలపై వేధింపులు
- నిత్యావసర సరుకులు పక్కదారి
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్



సిబ్బందితో మసాజ్ చేయించుకుంటున్న ప్రిన్సిపాల్



మూట కట్టి తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన సరుకులు

బుక్కరాయసముద్రం, జూన్ 24: ప్రభుత్వం మారినా మండలంలోని కొర్రపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తీరు మారలేదు. గతంలో వైసీపీ నాయకుల అండతో ఆమె అరాచకాలకు హద్దే లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులనే ఆమె గడగడలాడించింది. ఆమె పనిచేస్తున్న గురుకుల పాఠశాలలో తనిఖీకి ఉన్నతస్థాయి అధికారులు రావాలంటేనే జంకేవారు. విద్యార్థులకు సంబంధించిన నిత్యావసర వస్తువులను బహిర్గతంగా ఇంటికి తరలించేది. గతంలో విద్యార్థులకు వచ్చిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా జిల్లా డీసీఓ బాలాజీ నాయక్ పట్టుకుని ఆమెను సస్పెండ్ చేశారు. అనంతరం ఆమె అధికార పార్టీ నేతల సహకారంతో తిరిగి గురుకుల పాఠశాలకు వచ్చింది. అవినీతి ఆరోపణలున్నా... ఆమెపై విచారణ చేయడానికి సంబంధించిన జిల్లా కో-ఆర్డినేటర్ ముందుకు వచ్చేవారు కాదు. విద్యార్థులకూ సరైన భోజనం పెట్టేవారు కాదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలను వేధించేది. సిబ్బందితో వ్యక్తిగత పనులన్నీ చేయించుకునేది. వారితో ఇంటి వద్ద పనులు కూడా చేయించేది. సిబ్బందితో ఆమె రోజూ మసాజ్ చేయించుకోవడం.. జడ వేయించుకోవడం.. తదితర పనులన్నీ చేయించుకునేది. ఎవరికి ఫిర్యాలు చేసినా స్పందన లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తప్పనిపరిస్థితుల్లో ఆమె చెప్పినట్లు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వారినా ఆమె తీరు మారలేదు. దీంతో బాధితులు ఆమె అరాచకాలను చిత్రీకరిస్తూ తీసిన ఫొటోలు, వీడియోలను ఇటీవల సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమె అరాచకాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతికి పాల్పడలేదు : ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గురుకుల బాలికల పాఠశాలలో నేను ఎలాంటి అవినీతి పాల్పడలేదు. కొంత మంది గిట్టని వ్యక్తులు నాపై ఇలా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ, విద్యార్థుల కమిటీ సభ్యులుంటారు. ప్రతి ఒక్కటి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. అవినీతికి పాల్పడే అవకాశమే లేదు. సిబ్బందితో వెట్టిచాకిరీ, మసాజ్ చేయించుకోలేదు. సెలవుల సమయంలో ఇంటి వద్దకు సిబ్బంది వస్తే... ఆ సమయంలో ఏదో తల మీద పడితే.. సిబ్బంది చూశారే తప్ప.. ఎలాంటి పనులూ చేయించుకోలేదు.

ఘనంగా గ్రామ దేవతలకు పూజలు



ఊరేగింపులో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

రామగిరి, జూన్ 24: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్వగ్రామం వెంకటాపురంలో సోమవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు గ్రామంలో పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్, గ్రామస్థుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం గ్రామదేవతలైన ముత్యాలమ్మ, దుర్గమ్మ అమ్మవార్లతో పాటు యల్లమ్మ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. సాయంత్రం ముత్యాలమ్మ, దుర్గమ్మ ప్రతిమలతో పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లా బాలుర హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 24: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర జట్టు ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. జట్టులో... శివకుమార్, నల్లప్పరెడ్డి, జస్వంత్, సంతోష్ కుమార్, అరవింద్, చంద్రమౌళి, అనీల్‌కుమార్, శివ, మహేష్, వెంకటేష్, గోవర్ధన్, శివారెడ్డి, జిలాన్, మధు, బాబా ఫక్రుద్దీన్, రాజేష్, అనీల్‌కుమార్, తిప్పేస్వామి ఉన్నారు. ఈనెల 27 నుంచి ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు అక్రమ్‌బాషా పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్లో డిజిటల్ క్లాసులు ప్రారంభం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 24 : బీసీ స్టడీ సర్కిల్లో గ్రూప్-2 విద్యార్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణలో సోమవారం నుంచి డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. ఈ శిక్షణ పూర్తయ్యేంత వరకూ ఈ క్లాసులు కొనసాగుతాయని బీసీ స్టడీ సర్కిల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రవీంద్ర, అకౌంటెంట్ సుబ్బయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

పుస్తకాల పేరుతో కార్పొరేట్ దోపిడీ

అనంతపురం సెంట్రల్, జూన్ 24: పుస్తకాల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్బీతోపాటు బీసీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమైఖ్య సంయుక్తాధ్వర్యంలో నగరంలోని ఓ ప్రవేట్ కళాశాల వద్ద వారు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు వారి పేర్లతో పుస్తకాలు ముద్రించడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం పేరుతోనే పుస్తకాలను ముద్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, ఓబులేష్, పృథ్వీ, సురేష్‌యాదవ్, రమణయ్య పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె, జూన్ 24 : డయేరియా పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నియంత్రణ పై విద్య, వైద్యం, ఐసీడీఎస్, పంచాయతీ అధికారులతో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. డయేరియా కట్టడిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్యాధికారి గౌతమి, ఎంఈఓ తారా చంద్రానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గీతావాణి మాట్లాడుతూ వర్షాకాలం కావడం వలన సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కాచ్చి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలన్నారు. ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చూడాలన్నారు. ఇందులో వైద్యాధికారి శివకృష్ణ, తహసీల్దార్ మునిస్వామి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపాలి

శింగనమల, జూన్ 24: గ్రామాల్లో బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలని హెచ్ఎం వెంకట సుబ్బయ్య అన్నారు. సోమవారం మండలంలోని సోదనపల్లి పాఠశాలలో నిర్వహించిన విద్యా ప్రవేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని, ప్రభుత్వం ఆ విద్యార్థులకు పలు సౌకర్యాలను కల్పిస్తోందని అన్నారు.

వైసీపీ మోసం చేసింది.. ఆదుకోండి..!

- కలెక్టర్‌ను వేడుకున్న మాజీ వలంటీర్లు
- 'మీ కోసం' పునఃప్రారంభం
- తొలిరోజే 410 వినతులు





కలెక్టరేట్ ఆవరణలో నిరీక్షిస్తున్న మాజీ వలంటీర్లు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు , జేసీ తదితరులు

అనంతపురం టౌన్, జూన్ 24 : 'సార్... వైసీపీ నాయకుల మాయమాటలు విని ఉద్యోగా లకు రాజీనామాలు చేసి మోసపోయాం.. మాకు మళ్లీ ఉద్యోగాలు ఇప్పించి ఆదుకోండి సార్..' అని రాజీనామా చేసిన వలంటీర్లు అనంత కలెక్టరు వినోద్‌కుమార్‌ను వేడుకున్నారు. అనంత నగరంతో పాటు పలు ప్రాంతాల వలంటీర్లు పెద్దఎత్తున మీ కోసంలో వినతి ఇవ్వడానికి కలెక్టరేట్‌కు సోమవారం చేరుకున్నారు. దాదాపు రెండు గంటలు పాటు కలెక్టరేట్ ఆవరణంలో కూర్చొని తమకు వైసీపీ చేసిన మోసం, అన్యాయంపై చర్చించుకున్నారు. అయితే కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు కొంతమందికే అవకాశం ఇచ్చారు. దీంతో వారిలో కొందరు కలెక్టర్ వద్దకు వెళ్లి.. తమ గోడును వెళ్లబోసుకున్నారు.

'మీ కోసం'కు భారీ స్పందన

కలెక్టరేట్ మూడు నెలల తర్వాత ప్రజలతో కిటకిటలాడింది. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణను నిలుపుదల చేశారు. సోమవారం నుంచి మళ్లీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టరు వినోద్ కుమార్ నేతృత్వంలో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు కలెక్టరేట్‌కు వచ్చారు. తొలి రోజే 410 వినతులు అందాయి.

● స్కియాడ్‌కు నిధులివ్వండి : ఎస్కే యూనివర్శిటీలో పెద విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ కోసం ఏర్పాటు చేసిన స్కియాడ్‌కు నిధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కలెక్టర్‌ను కోరారు.

● అంగన్‌వాడీలు, ఆశాలు,ఎండీఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు నాగమణి, నాగేంద్ర, గోపాల్ కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

● వ్యవసాయ పెట్టుబడి సాయం కింద రూ 20 వేలు రైతు ఖాతాల్లోకి జమచేసి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, జిల్లాకార్యదర్శి బాలరంగయ్య విజ్ఞప్తి చేశారు.

● వైసీపీ ప్రభుత్వం వివిధ కారణాలు చూపి అనేక మంది దివ్యాంగుల పింఛన్‌ను తొలగించిందని, తమకు మళ్లీ పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు వసంతకుమార్, రాజేష్, వెంకటేష్ కలెక్టర్‌ను వేడుకున్నారు.

● అనంతపురంరూరల్ : జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు జేసీకి వినతి పత్రం ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న పెద్దన్న, రాయలసీమ జిల్లా అధ్యక్షుడు రమణ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేష్, నాయకులు పాల్గొన్నారు.

● శింగనమల : రైతులకు పెట్టుబడిసాయం వెంటనే అందజేయాలని జిల్లా వ్యవసాయ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తరిమెల భాస్కర్ శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కాలువలు బాగు చేయండి : ఆయకట్టు భూముల్లో కాలువలు పూర్తిగా పూడిపోయాయని, ఉపాధి పథకం కింద ఆ కాలువలను బాగు చేయించాలని ఆయకట్టు రైతులు కోరారు.

● చెన్నేకొత్తపల్లి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హమీద్‌బాషా, మండల పరిషత్‌లో ఎంపీడీఓ మోహన్‌కుమార్ మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సకాలంలో సిబ్బంది హాజరు కాకపోవడంపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా మాతృశ్రీ అంజనాదేవి ఆరాధన



చెన్నేకొత్తపల్లి, జూన్ 24: చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోన కణ్వాశ్ర మంలో శ్రీమల్లికార్జున స్వామి కణ్వాశ్రమ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాతృశ్రీ అంజనాదేవి 47వ ఆరాధనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, గంగపూజ, ధ్వజారోహణం, అభిషేకాలు నిర్వ హించారు. అనంతరం ఆలయంలో అంజనాదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చిన బృందాలతో వారిచే ప్రత్యేక భజనలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి ఊరేగింపు, పారాయణం, అనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'సదరం'లో దివ్యాంగుల నిరీక్షణ



సదరం క్యాంపులో వేచివున్న దివ్యాంగులు

శింగనమల జూన్ 24: శింగనమల కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సదరం క్యాంపు లో దివ్యాంగులు వైద్యుడి కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. ఈ హెల్త్‌సెంటర్ నందు సోమవారం నిర్వహించే క్యాంప్‌నకు 40 మంది దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేశారు. ఎప్పటిలాగే వారంతా ఉదయం పది గంటలకే సెంటర్ వద్దకు చేరుకున్నారు. వైద్యుడు మధ్యాహ్నం 3.30 గంటలకు వచ్చారు. అంతవరకూ ఆ దివ్యాంగులు నీళ్లు, అన్నం లేక తీవ్రంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు క్యాంపు వివరాలు సక్రమంగా తెలపడంలేదని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

కొందరికి సమాచారం ఇచ్చాం...: డాక్టర్ వెంకటరమణ

నాకు ప్రతి సోమవారం శింగనమల, తాడిపత్రిలో సదరం క్యాంపులు ఉన్నాయి. ఉదయం తాడిపత్రి.. సాయంత్రం శింగనమల షెడ్యూల్.. అయితే శింగనమలకు చెందిన దివ్యాంగులకు మధ్యాహ్నం ఒంటి గంటకు రావాలని కొందరికి ఫోన్ ద్వారా తెలిపాం. ఇకపై క్యాంపు వివరాలను పత్రికల ద్వారా తెలియజేస్తాం.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కరిబసవ రాజేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, జూన్ 24: అరవిందనగర్ శివాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని వేదికపై శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి.. అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు గురుమూర్తి నేతృత్వంలో అర్చక బృందం వేదమంత్రాల మధ్య శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ఉరవకొండ మఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో సర్వేశ్వరస్వామి మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులతో నగరోత్సవం నిర్వహించారు.

ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, జూన్ 24: స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. పలు సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... డిగ్రీ చివరి సంవత్సరంలోనే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్షావలి, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, వెంకన్న, చలపతి పాల్గొన్నారు.

ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి

అనంతపురం టౌన్, జూన్ 24: అనంత జిల్లా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇదివరకు కూడా గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉంటూ రిక్వెస్ట్ మీద కర్నూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం రాష్ట్రశాఖ ఉద్యోగోన్నతలు కల్పించడంతో సీనియార్టీలో ఆమెకు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా అవకాశం దక్కి అనంత ఆస్పత్రికే కేటాయించారు. దీంతో సోమవారం నాగమణి తొలుత సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

హంతకులను అరెస్ట్ చేయాలి

అనంతపురం సెంట్రల్, జూన్ 24: ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్ కుమార్‌ను హత్యచేసిన వారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని సమతా సైనిక్‌దళ్ నాయకుడు శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో కోరారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు సంపూర్ణ పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, జూన్ 24: కళ్యాణదుర్గం మండలం పులి తిమ్మారెడ్డిపల్లి ఎగువ తండాకు చెందిన వెంకటేష్‌నాయక్ (60) నగరంలోని నాలుగో రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ఓ బిల్డింగ్‌కు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఆ ఇంటి మెట్లు ఎక్కుతున్న సమయంలో జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక సోమవారం మరణించాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో టీడీపీ అభిమాని...

ధర్మవరంరూరల్ : కనగానపల్లికు చెందిన టీడీపీ అభిమాని బట్టా నాగభూషణం (58) గుండెపోటుతో సోమవారం మరణించాడు. ఉదయం ఇంటి వద్ద ఉన్న నాగభూషణం ఉన్నఫలంగా ఛాతిలో నొప్పిరావడంతో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించేలోపే అతను మరణించాడు. అతని మృతదేహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, నాయకులు సరిపూటి వెంకటనారాయణ, బట్టా నాగేంద్ర, బట్టా సురేశ్‌చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళపై కొడవలితో దాడి.. ముగ్గురి అరెస్టు

బుక్కరాయసముద్రం, జూన్ 24: మండలంలోని కొర్రపాడులో ఆదిలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం రాత్రి కొడవలితో దాడి చేశారు. కొర్రపాడులో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నీలో కొర్రపాడు గ్రామానికి చెందిన క్రీడాకారులు విజయం సాధించారు. దీంతో ఆ గ్రామంలో క్రీడాకారులు, యువకులు కలిసి డీజీ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆదిరెడ్డి ఇంటి వద్ద డీజీ సౌండ్ సిస్టమ్ పెట్టడంతో అతని భార్య ఆదిలక్ష్మి ఇక్కడ పెట్టవద్దని వాదనకు దిగింది. ఈ విషయంపై వాగ్వాదం పెరగడంతో బోయ నాగేంద్ర ఆమెపై దాడి చేశాడు. అనంతరం అతని బంధువులు తలారి ఆదినారాయణ, కుమారుడు తలారి పార్థసారథి కొడవలితో ఆమె చేతి, తలపై, ఆమె కుమారుడు అనిల్‌కుమార్‌రెడ్డిపై దాడి చేశాడు. గాయపడిన వారిద్దరినీ అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన ఆ ముగ్గురిపై హత్యాయ త్నం కింద సోమవారం కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు అనంతపురం రూరల్ సీఐ రామక్రిష్ణరెడ్డి తెలిపారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

అనంతపురం కల్చరల్, జూన్ 24 : గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐయూటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అయినా చాలాగ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తమ విధులను కొనసాగిస్తున్నారన్నారు. ఇటీవల గ్రామపంచాయతీల పరిధిల్లోని పారిశుధ్య కార్మికులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించుకుంటామని అధికారులు చేస్తున్న బెదిరింపులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐయూటీయూసీ నాయకులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

అనంతపురం న్యూటౌన్ / బుక్కరాయసముద్రం, జూన్ 24: బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి గ్రామంలోని ప్రసన్నాంజనేయ ఫర్టిలైజర్స్, శ్రీ బాలాజీ ఫర్టిలైజర్స్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సర్టిఫికేట్ చూపించకపోవడం... భౌతిక నిలువలకు స్టాక్‌కు వ్యత్యాసాలు ఉండటం.. స్టాక్‌బోర్డు, రిజిష్టర్ సరిగా లేకపోవడాన్ని వారు గుర్తించారు. రూ.2.23 లక్షల విలువగల అనుమతి, సరైన రికార్డు లేని ఎరువులను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాస్, ఎస్ఐ ఫణింద్రనాథ్‌రెడ్డి, స్థానిక ఏఓ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

గార్లదిన్నె: నాసిరకం మందులు, ఎరువులు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలిన రాయలసీమ రైతు సంఘం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైతు భరోసా కార్యాలయంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా సుమారు 40 ఎరువుల దుకాణాలున్నాయని, అయితే ఆ దుకాణాలలో రైతులకు నాసిరకం మందులు, ఎరువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. షాపులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

అనంతపురం సెంట్రల్ : ప్రథమ చికిత్సపై అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ మోహనకృష్ణ ప్రథమ చికిత్స విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ అనంతరాముడు, వైస్ చైర్మెన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఖలీల్‌బాషా, నవీన్ పాల్గొన్నారు.



పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యాధికారులు

పరిటాల సునీతకు శుభాకాంక్షలు

రామగిరి: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను నియోజక వర్గంలోని మండల వైద్యాధికారులు సోమవారం వెంకటాపురంలో మర్యాద పూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. వారిలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ సెల్విసాల్మాన్, వైద్యులు రవీనాయక్, చెన్నారెడ్డి, ఆదికేశవులు,సరిత తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీ హర్షణీయం : దగ్గుపాటి

అనంతపురం అర్బన్ : మెగా డీఎస్సీ హామీ అమలుకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అధ్యతన సోమవారం ఏపీ మంత్రివర్గం తొలి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు మేలు చేసే విధంగా చంద్రబాబు హామీలు ఇచ్చారని, వీటిలో కీలకమైన ఐదు హామీలపై సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే సంతకం చేశారని అన్నారు. తాజాగా మంత్రివర్గ తొలి భేటీలోనే వాటిని ఆమోదించి తన చిత్త శుద్ధిని ఆయన నిరూపించుకున్నారని కొనియాడారు. మిగిలిన హామీలన్నింటినీ చంద్రబాబు తప్పకుండా నెరవేరుస్తారన్నారు.

ఎంపీలను కలిసిన ముస్లిం నాయకులు



ఎంపీలు బీకే, రామ్మోహన్‌నాయుడుతో నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్: పార్లమెంటులో సోమవారం ప్రమాణస్వీకారం చేసిన నూతన ఎంపీలు బీకే పార్థసారధి, రామ్మోహన్ నాయుడు, అంబికా లక్ష్మీనారాయణ, పెమ్మసాని చంద్రశేఖర్, అప్పలనాయుడు తదితరులను జిల్లాకు చెందిన పలువురు ముస్లిం సంఘాల నేతలు ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సాలార్ బాషా, ఐఎంఎం మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి



బండి సంజయ్‌తో రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్ : పెరిగిన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీల 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించి పెంచాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెలంగాణ మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి విన్నవించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీసీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రిన్సిపాల్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఏపీఆర్‌సెట్ అర్హత సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బ్రాంచ్(కోర్సు)ల వారిగా నిష్ణాతులను ప్యానెల్‌గా ఏర్పాటుచేసి అభ్యర్థులను ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రొఫెసర్లు సుదర్శన రావు, భానుమూర్తి, శోభబిందు, అరుణకాంతి, చెన్నారెడ్డి, వసుంధర, శివకుమార్, బాలనరసయ్య, దిలీప్‌కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి.. శుభపరిణామం: ఏపీఎన్జీఓలు

అనంతపురం ప్రెస్‌క్లబ్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మికులను ఐదేళ్లుగా నరకం చూపించిన వైసీపీ ప్రభుత్వం ఓటమి... శుభపరిణామమని ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్జీఓ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుతల్లి విగ్రహం వద్దనున్న తమ కార్యాలయ ఆవరణంలో 300 పడకల ఆస్పత్రి నిర్మాణమంటే ఉద్యోగులంతా స్వచ్ఛందంగా ఒప్పుకున్నామని, అయితే తమకు కార్యాలయ ఏర్పాటు చేస్తామని చెప్పి నరకం చూపించారని అన్నారు. తమకు కార్యాలయం నిర్మించకపోగా... తమ స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించి మోసం చేశారన్నారు. ఈ విషయంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ భవన నిర్మాణాన్ని కూల్చకుండా ఆ భవనాన్ని హెచ్ఎల్సీ ఇరిగేషన్ ఉద్యోగు లకు కార్యాలయ భవనంగా మార్పు చేస్తే బాగుంటుం దన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరు స్తుందన్న గట్టి నమ్మకం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి శ్రీధర్ బాబు, సహాధ్య క్షులు రామనాథరెడ్డి, ఉపాధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శులు దామోదర్, ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మహబూబ్ దౌలా, మహిళా సంయుక్త కార్యదర్శి హబీబా, కార్య నిర్వా హక కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి విష్ణు వర్దన్, ఈసీ మెంబర్లు విష్ణువర్దన్, వీరేంద్రబాబు పాల్గొన్నారు.

వైసీపీ మద్దతుదారులపై కేసు

తాడిపత్రిటౌన్, జూన్ 24: మండలంలోని బ్రాహ్మణపల్లిలో రెండురోజుల కిందట నీటి విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి సోమవారం వైసీపీ మద్దతుదారులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అశోక్, రామోహన్‌రెడ్డి, రాజారెడ్డితోపాటు మరికొంత మందిపై కేసు నమోదుచేశామని తెలిపారు.

శ్మశాన స్థలం కోసం ఘర్షణ

యల్లనూరు, జూన్ 24: మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామంలో ఎస్సీలకు సంబంధించిన శ్మశాన స్థల విషయంలో సోమవారం స్వల్పఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వంక పోరంబోకు స్థలాన్ని గ్రామానికి చెందిన రమురామాంజనేయరెడ్డి సాగు చేసుకుంటున్నారు. అయితే ఈ స్థలం తమ శ్మశానానికి కేటాయించినదని గ్రామానికి చెందిన ఎస్సీ వర్గీయులు గతంలోనే అడ్డు తగిలారు. అప్పట్లో పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను సద్దుమణిగించారు. అయితే సోమవారం మరోసారి ఈ విషయంలో ఎస్సీ వర్గీయులు రమురామాంజనేయరెడ్డి వర్గీయులు స్వల్పఘర్షణకు దిగారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం గ్రామానికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎవరు ఈభూమిలో దిగరాదని తెలియజేశారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

తాడిపత్రిటౌన్, జూన్24: మండలంలోని కోమలి గ్రామసమీపంలో సోమవారం రైలులో నుంచి జారిపడి ముత్యాల తేజ అనే యువకుడు గాయపడినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణ సమీపంలోని ఆర్టీటీ కాలనీకి చెందిన ముత్యాలతేజ జలాయిగూ తిరుగుతుం డేవాడు. పుదుచ్చేరి వెళ్లిన ముత్యాలతేజ తిరుగుప్రయాణంలో రైలులో బయలుదేరాడు. రైలు కోమలి రైల్వేస్టేషన్‌కు సమీపంలోకి రాగానే జారిపడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

గుంతకల్లుటౌన్,జూన్24: కసాపురం గ్రామ పరిధిలోని నిరుపేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శేషపణికి అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 23న తహసీల్దారుకు వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికి స్పందన లేదన్నారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని తహసీల్దారును కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘం పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయండి

పుట్లూరు, జూన్24: మండలంలోని నాయకునిపల్లి గ్రామంలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ప్రతినెలా రేషన్ సరుకులకు సుమారు రెండుకిలోమీటర్ల దూరం వెళ్లాలేక వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని కోరారు.

రుణాల రెన్యువల్‌కు 30 వరకు గడువు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 24: రైతులు తమ పంట రుణాలను ఈ నెల 30లోపు రెన్యువల్ చేసుకోవాలని దాసరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో టి నారాయణ స్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నారన్నారు. రైతులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీతో సహా(మొబైల్ నెంబర్) కలిగిన పాన్ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు, మూడు పాస్ ఫోటోలను సొసైటీలో అందజేయాలన్నారు.


దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

కణేకల్లు, జూన్ 24: మండలంలోని మాల్యం పల్లి గ్రామంలో ఇద్దరు టీడీపీ నాయకులపై దాడి చేసిన సంఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మాల్యం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులైన బసప్ప, మారెప్ప, సురేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కరువు నివారణ నిధులు కేటాయించాలి

పెద్దవడుగూరు, జూన్24: కరువు నివారణ కోసం ప్రత్యేక నిధులు మండలానికి కేటాయించాలని రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ శేషారెడ్డి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల రైతు సంఘం కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం వెంటనే రైతుల ఖాతాల్లోకి జమచేయాలన్నారు. 2023 ఖరీఫ్, రబీలో పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు పంట బీమా ప్రకటించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. పెట్టుబడి సాయాన్ని ఎకరాల ఆధారంగా కనీసం ఎకరాకు రూ.10వేలు 10ఎకరాల వరకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, కుల్లాయప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

టిప్పర్ల సీజ్



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పామిడి/ పెద్దవడుగూరు, జూన్ 24: పెన్నానదిలోని పామిడి - కొండూరు గ్రామాల మధ్య అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నించిన తొమ్మిది ఖాళీ టిప్పర్లను సోమవారం తెల్లవారుజామున సీజ్ చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా పెన్నానది నుంచి ఇసుకను తరలించేందుకు కొందరు యత్నించారన్నారు. స్థానిక రైతులు, పామిడి పోలీసులు సమాచారం అందించడంతో పోలీసులు ముకుమ్మడిగా దాడి చేసి పామిడి పోలీసులు తొమ్మిది, పెద్దవడుగూరు పోలీసులు ఏడు టిప్పర్లను సీజ్ చేశారు. పామిడి పోలీసులు సీజ్ చేసిన తొమ్మిది టిప్పర్లను ఓ దాబా ప్రాంగణంలో ఉంచారు. పెద్దవడుగూరు పోలీసులు పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా కొండూరు గ్రామస్థులు ఇసుకను అక్రమంగా తరలించే ప్రాంతంలో ఊటకాలువ ద్వారా రైతులు తమ పంట పొలాలను సాగు చేసుకుంటున్నారని, ఇసుక తరలిస్తే ఊట ఎండిపోతుందని, దీన్ని అడ్డుకోవాలని పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దన్న తదితరులు ఉన్నారు.

చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే అమిలినేని దృష్టి

కళ్యాణదుర్గం, జూన్ 24: నియోజకవర్గంలోని 114 చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజావేదిక వద్ద మైనర్ ఇరిగేషన్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువు, వాటి విస్తీర్ణం, అభివృద్ధికి చేయాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో నియోజకవర్గంలో ఎన్ని చెరువులు వున్నాయి, రెవెన్యూ శాఖ పరిధిలో ఎన్ని ఉన్నాయి వాటి విస్తీర్ణం, వాటి స్థితిగతులపై మైనర్ ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి అందరం ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు.



ప్రజావేదిక కార్యాలయం వద్ద మైనర్ ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ర్యంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ మండలంలో వున్న నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి వైపు నడిపించేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, ఉడేల తిప్పేస్వామి, తలారి యర్రిస్వామి, దండా వెంకటేశులు దాబా నాగరాజు ఎమ్మెల్యేకు సమస్యలు వివరించారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కంబదూరుకు విచ్చేయడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలు వివరించారు. దాంతోపాటు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సంద

జీవో 117ను తక్షణమే రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

గ్రామీణ విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీవో నెంబర్ 117ను రద్దు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజావేదిక వద్ద ఏపీటీఎఫ్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు వెళ్లి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి నరసింహులు, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, వెంకటేష్‌లు,



ఎమ్మెల్యే సురేంద్రబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బొమ్మయ్య, చెన్నకేశవ, కృష్ణ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.

మరో బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాలని వినతి

కుందుర్పి: మండల కేంద్రంలో మరో బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయుడు బీసీ తిమ్మప్ప ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి సమస్యలు వివరించారు. మండల కేంద్రంలో కెనరా బ్యాంకు మాత్రమే ఉండటంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ బ్యాంకులో 6500 మంది రైతులు, ఇతర ఖాతాదారులు ఉండటంతో లావాదేవీలు కోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అందుకే బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడి మరో బ్రాంచ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

దోమల వల్ల వ్యాధులు

బొమ్మనహాళ్, జూన్ 24: దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలుతాయని శ్రీధరబాద వైద్యులు తెలిపారు. సోమవారం గోనేహాళ్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలం సందర్భంగా దోమల వృద్ధి చెందుతాయని మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షాలు కురుస్తుండటంతో తాగునీరు కలుషితమై వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉందని జ్వరంతో ఉన్నపుడు ఆసుపత్రికి తీసుకెళ్లాలని, డ్రైడే పాటించాలని, దోమతెరలు వాడాలని విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాళిదాసురావు, వెంకటేష్‌లు, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై అవగాహన

విడపనకల్లు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విడపనకల్లు వైద్యాధికారులు, ఉరవకొండ ఏరియా మలేరియా యూనిట్ అధికారి భక్తుల కోదండ రామి రెడ్డి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామి రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల మండల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య ఈఓఆర్డీ సత్యబాబు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

భూములను ఆన్‌లైన్ చేయాలని వినతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

కూడేరు, జూన్ 24: సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో తమ భూములు తొలగించారని, ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా ఆన్‌లైన్ చేయలేదని పలువురు రైతులు అధికారుల ఎదుట వాపోయారు. ఖరీఫ్ సీజన్ వస్తే భూముల్లో రుణాలు రెన్యువల్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సాగు చేసిన భూములను ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఉదిరిపికొండ చెందిన రైతులు మహేష్, వీరభద్ర, వీరుపాక్షి తదితరులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఆన్‌లైన్ చేయకుండా కక్ష సాధింపుకు దిగిందని, అధికారులు స్పందించి సాగు చేసిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు

యాడికి, జూన్24: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జనసేన పార్టీ మండల కన్వీనర్ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు యాడికిలో 500 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ, అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన స్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు జాకీర్‌హుస్సేన్, శివ, కుమార్, శివ, వెంకటేష్, మల్లికార్జున, బాబు, మధుఆచారి, భూషణ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

లారీకి మంటలు

కూడేరు, జూన్ 24 : మండల పరిధిలోని కమ్మూరు గ్రామ ప్రధాన రహదారిపై లారీ టైర్ల నుంచి మంటలు చెలరేగి, మొత్తం కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. బళ్లారి నుంచి అనంతపురానికి నల్లటి మట్టిని తరలిస్తున్న లారీ సోమవారం వేకువ జామున కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలోకి రాగానే మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే లారీని రోడ్డుపక్కన నిలిపి, దూకేశాడు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆదుపు చేసింది. లారీ ప్రమాదం పట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



మాల్యంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూన్ 24: మండలంలోని మాల్యం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుండి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలను టీడీపీ నాయకులు అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం జనార్దనా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ నాయకులు ప్రభాకర్, శరభనగౌడ్, కృష్ణారెడ్డి, ఆశోక్, కిష్టప్ప, కురుబ హరి, వంద్ర, గురుస్వామి, రామప్ప, ఎల్లప్ప హాజరయ్యారు.

గందరగోళం

ఉరవకొండ, జూన్24: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ప్రజానమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉదయం 10గంటలకు స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించారు. దీంతో సమస్యలను తెలియజేయడానికి వచ్చిన ప్రజలు తికమకపడ్డారు. గతంలో గ్రీవెన్స్, స్పందన కార్యక్రమాలు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించేవారు. అక్కడే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం అలా కాక రెవెన్యూ కార్యాలయంలో కొంతమంది అధికారులు, ఎంపీడీవో కార్యాలయంలో మరికొంత మంది అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఎక్కడ ఏ శాఖ అధికారులు ఉన్నారో తెలియక ప్రజలు గందరగోళానికి గురయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ మండల ఇంజనీర్, సబ్ జైస్టార్, ఎంఈవో, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎం హాజరయ్యారు. రెవెన్యూ కార్యాలయంలో ఈఓఆర్డీ, అగ్రికల్చర్, ఎస్ఈబ్ల్యూఎస్, ఆర్సీస్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు. ఒకే చోట కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదు ఫిర్యాదులు

గుమ్మఘట్ట, జూన్ 24: మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తొలిసారిగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఐదు ఫిర్యాదులు అందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మండల కేంద్రంలో శుద్ధ జలాల ప్లాంట్ మరమ్మతు చేయించి, విద్యుత్ బకాయిలు చెల్లించాలని సర్పంచ్ భర్త సహాయక ఫిర్యాదు చేయగా పూలకుంట గ్రామానికి చెందిన నలుగురు రైతులు వెబ్‌ల్యాండ్, అడంగల్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

యాడికి, జూన్24: జనసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితకంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తెలిపారు. సోమవారం యాడికిలో జనసేవ ట్రస్ట్, బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటివైద్యశిబిరంలో 130మందికి పరీక్షలు నిర్వహించారు. 75మంది రోగులను ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంగాధర్, సునీల్‌కుమార్, జనసేవ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తాడిపత్రిటౌన్, జూన్24: గత ఏడాది ఖరీఫ్, రబీలో సాగుచేసిన వేరుశనగ, పప్పుశనగ, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు వర్షాలు రాక నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సోమవారం రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఖాతాల్లో జమచేయాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ బీమాను ప్రకటించాలన్నారు. కరువు నివారణ ప్రత్యేక నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నారాయణరెడ్డి, జయశంకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేష్, గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పరిధిలోని అడ్డుగోడలను తొలగించండి



ఏడీఆర్ఎం సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

- ఏడీఆర్ఎంకు సీపీఎం వినతి

గుంతకల్లు, జూన్24: పట్టణంలోని కాలనీల నుంచి రైల్వే ప్రాంతాల్లోకి జనం రాకుండా ఏర్పాటుచేసిన అడ్డుగోడలను తొలగించాలంటూ ఏడీఆర్ఎం సుధాకర్‌కు సీపీఎం నాయకులు విన్నవించారు. సోమవారం ఉదయం పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయంలో ఏడీఆర్ఎం సుధాకర్ చాంబర్‌కు వెళ్లిన సీపీఎం నాయకులు సమస్యను వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు డీ శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే పరిధిలోని పలు రహదారులను మూసివేసిన కారణంగా రైల్వే ఆసుపత్రి, రైల్వే పాఠశాలలు, రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లడానికి పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైల్వే ఉద్యోగులు కూడా ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. కనుక రహదారులకు అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, నాయకులు మారుతీ ప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, చంద్ర, ఓబులేశు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న డయేరియా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

ఉరవకొండ, జూన్24: మండలంలోని పెన్నహోబిలం, కొనాపురం, మోపిడి, ఉరవకొండ పట్టణంలో డయేరియా కేసులు విజృంభిస్తున్నాయి. వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో డయేరియాతో 30మందికి పైగా చేరినట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన వారికి చికిత్స అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఎల్లోజి తెలిపారు. సీజనల్ వ్యాధులతో కూడా అనేకమంది ఆసుపత్రిలో చేరుతున్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి కిటకిటలాడింది. 530మంది దాకా ఓపీలో వైద్యం చేయించుకున్నారు.

గ్రామాల్లో శుభ్రతపై శ్రద్ధ పెట్టండి

డీ.హీరేహాళ్, జూన్ 24: వర్షాకాలం మొదలైనందున గ్రామాలలో పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని అధికారులు ఆదేశించారు. సోమవారం స్థానిక ఆస్పత్రిలో తహసీల్దార్ బాల ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రమునాథ్, ప్రభుత్వ వైద్యాధికారి శ్రావణికుమార్ అధ్యక్షతన మండల వ్యాప్తంగా ఉన్న వైద్యసిబ్బంది, ఆయాలు, ఆశావర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానా కాలంలో అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ గ్రామాలలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. శానిటేషన్ ప్రక్రియ నిరంతరం చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

గుత్తి, జూన్ 24: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని పలు విభాగాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మహిళ, పురుష వార్డులు, ఆపరేషన్ గది, మార్చురీ గదిని ఆయన పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులను ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగితెలుసుకున్నారు. పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలోని వసతులు, వైద్య సేవల గురించి సూపరింటెండెంట్ ఎల్లప్ప ఆయనకు వివరించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

యాడికి, జూన్24: రైతులకు తక్షణమే పంట పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ మోహనవల్లికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్, రబీలో వర్షాభావంతో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఖరీఫ్‌లో రైతులు పంటలు సాగుచేయాలంటే పంట పెట్టుబడి సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బషీర్ అహమ్మద్, మోహన్ ఉన్నారు.

ఉరవకొండ: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లోకి వెంటనే జమచేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు మధుసూదన్, ఓబులేశు, సోసియా శ్రీన్ రైతులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాలో జమచేయాలని ఏపీ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు బారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు



గుత్తిలో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మల్లికార్జున, మల్లేష్, చిన్నమారెన్న, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ. 20 వేలు రైతు ఖాతాలోకి జమ చేయాలని సీపీఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆమ్మర్ ప్రసాద్, మండల కార్యదర్శి రంగనాథ్, పట్టణ కార్యదర్శి రమా, మంజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, భవిత్ తదితరులు పాల్గొన్నారు.